కుల గణన చరిత్రాత్మక నిర్ణయం


సమావేశంలో మాట్లాడుతున్న మిద్దెల జితేందర్

చంపాపేట: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన చరిత్రాత్మక నిర్ణయమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. చంపాపేటలోని సేవాదళ్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బీసీలపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనతో పాటు కులగణన చేయాలన్నారు. కులగణన రీసర్వే పూర్తయిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయటం తథ్యమని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ కులం అడుగుతున్న బీజేపీ దేశంలో కులగణన చేపట్టి ఆయన ఇంటికి వెళ్లి కులం వివరాలు తెలుసుకోవాలన్నారు. దేశానికి గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను బీజేపీ నేతలు మర్చిపోయి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దయాకర్‌రావు, సురేందర్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్: ఈ నెల 17 నుంచి 20 వరకు జరగనున్న ఆల్ ఇండియా అంతర్ జిల్లా సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించి యువతను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే పోటీలకు ఇప్పటికే దేశ వ్యాప్తంగా 85 జట్లు తమ పేర్లు నమోదు చేసుకున్నాయని, దాదాపు 1000 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఉచిత భోజనం, క్రీడా దుస్తులు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పవన్‌కుమార్, వెంకట్రాంరెడ్డి, తిరుమల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శివకుమార్, విజయ్ కుమార్, బేబిగౌడ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల హామీని అమలు చేయాలి


నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు

వనస్థలిపురం: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆటో ట్రాన్స్‌పోర్ట్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కడారి రాములు అన్నారు. ఆదివారం ఎల్‌బీనగర్‌లో ఆటో స్టాండ్ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమ సమస్యలపై జేఏసీ ఇచ్చిన బంద్‌ను విరమించుకోవాలని రవాణా శాఖ మంత్రి కోరారని, కానీ చర్చలకు పిలువకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, లేకుంటే మళ్లీ ఆటోల బంద్‌ను ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉదర రమేష్, రాములు, రవి, కుమార్, రమేష్, జంగయ్య, పి.శివ, కే.శివ, రఘు, జగన్, భాస్కర్, గణేష్, సైదులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


విద్యార్థులను సన్మానిస్తున్న వజీర్ ప్రకాష్‌గౌడ్

నాగోలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాగ్‌లో నిర్వహించిన రెండవ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో సీనియర్ బ్లాక్ బెల్ట్ హోల్డర్, కోచ్ విజయ్ ఆధ్వర్యంలో కొత్తపేట ప్రాంతానికి చెందిన విద్యార్థులు పవన్‌తేజ, హృతిక్, కార్తికేయ, అశ్రుత్, శ్రీహిత్, కెవిన్ బంగారు, వెండి పతకాలు సాధించారు. ఆదివారం కొత్తపేట మహిళా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు కోచ్ విజయ్‌ను వజీర్ ప్రకాష్‌గౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కరాటేతో పాటు చదువులోనూ రాణించాలన్నారు.

రోడ్లన్నీ శుభ్రంగా ఉండేలా చూడాలి

నాగోలు: డివిజన్ పరిధి కాలనీల్లోని రోడ్లన్నీ శుభ్రంగా ఉండేలా చూడాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. డివిజన్ పరిధిలోని సమతపూరి కాలనీలో ఆదివారం ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడారు. కాలనీల్లో పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కాలనీలో డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. మ్యాన్‌హోళ్లు ధ్వంసం కావడంతో వాటికి మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను కోరారు.


శానిటైజేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న పవన్‌కుమార్

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎంపీకి వినతి


ఎంపీ ఈటలకు సమస్యలు వివరిస్తున్న సంఘం ప్రతినిధులు

మన్సూరాబాద్: కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించి, కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. కాలనీలో అనధికారింగా ఉన్న శ్మశానవాటికను మరో ప్రాంతానికి తరలించి కాలనీలోని పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో వినోద్‌రెడ్డి, మణిపాల్ రెడ్డి, రాంరెడ్డి, భీమిడి మాధవరెడ్డి, వెంకటరెడ్డి, సంజీవరెడ్డి ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరామ అయోధ్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటాచారి, కోశాధికారిగా సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకట్‌రెడ్డి, నవీన్‌గుప్తా, సంయుక్త కార్యదర్శులుగా ప్రశాంత్‌రెడ్డి, యాదవరెడ్డి, సలహాదారులుగా శ్రీధర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎల్.దశరథరెడ్డి, కన్వీనర్‌గా నరసింహా ముదిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాము, కార్తిక్‌రెడ్డి, సురేశ్‌ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, నర్సింహాచారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



ఎంపీ ఈటలకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ సభ్యులు

హయత్‌నగర్: హయత్‌నగర్ బ్లాక్ ఆఫీస్ ఆవరణలో పునర్నిర్మించిన రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఎంపీ ఈటల రాజేందర్, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్లు నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నాయకులు పారంద స్వామి, ఎర్ర రవిందర్, నాగభూషణం, దాసరమోని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆది పరాశక్తి.. ప్రత్యంగిరా పరమేశ్వరి

- రాష్ట్రంలోనే మొదటి ఆలయంగా ప్రసిద్ధి
- నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ప్రత్యంగిరా దేవాలయం


పరమేశ్వరి అమ్మవారు

దిల్‌సుఖ్‌నగర్: తన భక్తులకు ఎలాంటి హాని జరగకుండా ప్రతి నిత్యం క్షేమంగా ఉండేలా చూసుకుంటోంది ఆదిపరాశక్తి శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవి. ప్రత్యంగిరా అమ్మవారిపై భక్తులకు అపార నమ్మకం ఇక్కడి అమ్మవారిని కొలిస్తే సర్వరోగాలు, సమస్త పీడలు తొలిగిపోతాయని విశ్వాసం. కొంగు బంగారంగా విరజిల్లే అమ్మవారి దయతో భక్తులకు ఐశ్వర్యం కలుగుతుందని నమ్ముతారు. గడచిన నాలుగున్నర దశాబ్దాలుగా పరిశోధనలు చేసి తెలుగు రాష్ట్రాల్లోనే మొట్టమొదటి సారిగా మహేశ్వరం నియోజకవర్గంలోని కొత్తపేట సమీపంలోని శ్రీరామకృష్ణాపురంలో కుర్తాళం పీఠం శ్రీ సిద్ధేశ్వర పీఠాధిపతులు సిద్ధేశ్వర భారతి స్వామిజీ ఆదిపరాశక్తి ప్రత్యంగిరా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు.


హోమాలు ప్రత్యేకం..

భక్తుల సమస్త కోరికలు తీర్చే మహాశక్తిగా ప్రత్యంగిరా అమ్మవారికి నిత్యం ప్రత్యేక హోమాన్ని నిర్వహిస్తారు. హోమంలో ఎండు మిరపకాయలు, తానికాయలు, ఉత్తరేణి సమీధలు, తెల్ల ఆవాలు, నల్ల ఉప్పు, మిరియాలు, వేప, మునగ, ఉడుగు, శొంఠి సమిధలుగా ఉపయోగిస్తారు. ప్రతి అమావాస్యకు ప్రత్యేక అభికాలు, హోమాలను నిర్వహించడం ఇక్కడ అనవాయితీ. ఇక్కడి మందిరంలో వారాహి దేవి, రాధాకృష్ణులు, నాగేంద్రుడు, దశమహా విద్యా దేవతలు, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయుడు, దత్తాత్రేయుడు, సాయిబాబా, అయ్యప్పస్వామి, కాలభైరవుడు, సరస్వతీదేవిచ తదితర దేవాతామూర్తులను దర్శించుకోవచ్చు. దేశంలోనే వివిధ ప్రాంతాల నుంచి శ్రీప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివస్తుటారు. వారిలో చాలా మంది హోమాలు నిర్వహిస్తూ మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవారిని భక్తితో పూజిస్తే అన్ని విధాలా అనుగ్రహిస్తారని భక్తుల విశ్వాసం.

ఏర్పాట్లు పూర్తి

ప్రత్యంగిరా అమ్మవారి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి బుధవారం వరకు అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు తగి ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రోజూ ఉదయం అమ్మవారికి విశిష్ట అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, రాత్రి మహా నక్షత్ర హారతులు, యాగ మండప దేవత హోమాలను నిర్వహిస్తామని తెలిపారు. 19 వ తేదీన అమ్మవారికి అన్నాభిషేకం, సాయంత్రం పల్లకి సేవ ఉంటుంటుదన్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



ప్రత్యంగిరా అమ్మవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పెద్ద ఎత్తున్న తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఉంటుంది.

–మునిపల్లె శ్రీనివాస్ ఆలయ సెక్రటరీ.

క్రమశిక్షణతోనే విజయం సాధిస్తాం

మీర్‌పేట: క్రమశిక్షణ కలిగి ఉన్నప్పుడే జీవితంలో విజయం సాధిస్తారని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి తెలిపారు. మీర్‌పేట నాగార్జున మాంటిసోరి ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్ 12వ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, భావ వ్యక్తీకరణ పెంపొందించేందుకు తమ విద్యాసంస్థల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పిల్లలతో తల్లిదండ్రులు కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. గత సంవత్సరం 10వ తరగతిలో పది పాయింట్లు సాధించిన 12 మంది విద్యార్థులకు రూ.10వేల నగదుతో పాటు జ్ఞాపికను అందజేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన క్షీరసాగర మథనం, రామాయణం, బాహుబలి, చంద్రముఖి వంటి పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ రజిని, సీఏఓ ఏ.శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, ప్రిన్సిపాల్ డి.మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ గౌటేటి ఫంక్షన్‌హాల్, సాయినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఎస్సీ వర్గీకరణను వెనక్కి తీసుకోవాలి


మధుయాష్కిగౌడ్‌తో జేఏసీ నాయకులు

ఎల్‌బీనగర్: అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ తప్పులతడకగా ఉందని మాలాలు, మాలాల ఉపకులాలకు పూర్తిగా అన్యాయం జరిగే విధంగా ఉందని మాలాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బేర బాలకిషన్, మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రామచందర్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను వెనక్కి తీసుకోవాలని ఆదివారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని పార్టీల నాయకులను కలిసి వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లేరేషన్‌లో సూచించిన విధంగా 18 శాతం రిజర్వేషన్ అమలు చేసే వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆదర్శవంతుడు


సేవాలాల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అందరికీ ఆదర్శవంతుడని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం డివిజన్‌లోని అంబేడ్కర్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిజనులకు దశ నిర్దేశం చేసిన సేవాలాల్ హైందవ ధర్మం, గొప్పదనం విశిష్టతలను బోధించాడని, బంజారాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీను, జంజ్యానాయక్, శంకర్‌నాయక్, గోవర్ధన్, పంతూనాయక్, బాలూనాయక్, శ్రీకాంత్, అరుణ్, ఎర్ర ప్రేమ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మన్సూరాబాద్: హయత్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆదివారం ప్రతిష్ఠాపనోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టంగుటూరి నాగరాజు, ఆనంద్‌యాదవ్, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

చెత్త నిండగానే చెప్పేస్తుంది!

- అందుబాటులోకి స్మార్ట్‌బిన్లు
- చెత్త పేరుకుపోయే చోట మళ్లీ ఏర్పాటు
- నిండుతుండగానే అప్రమత్తం చేసే సెన్సర్లు
- సర్కిల్ వారీగా జీవీపీల గుర్తింపు



చాదర్‌ఘాట్: రోడ్ల పక్కన పేరుకుపోతున్న చెత్త సమస్య రోజురోజుకు తీవ్రమవుతుంది. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా రోడ్ల పక్కన చెత్త వేసే వారి సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దాలని అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 మలక్‌పేట పరిధిలో ప్రధాన రహదారుల నుంచి అంతర్గత రహదారులు, బస్తీలు, కాలనీల్లో భారీగా చెత్త పేరుకుపోతుంది. ఈ నేపథ్యంలో తరచూ చెత్త పేరుకుపోయే ప్రాంతాల్లో జీవీపీ చెత్తలేకుండా సమస్య పరిష్కారానికి గతంలో నిషేధించిన డంపర్ బిన్లు (చెత్త డబ్బాలు) మళ్లీ అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

అడ్వాన్స్ ట్రాకింగ్ విధానంతో..

సర్కిల్–6 సుమారుగా 69 జీవీపీలను గుర్తించి ఈ మేరకు డంపర్ బిన్లు కేటాయించారు. కొత్తగా మంజూరైన ఈ డంపర్ బిన్లు ఒక్కొక్కటి 1100 లీటర్ల సామర్థ్యంతో ఉండగా గార్బేజీ వల్లరబుల్ పాయింట్ వద్ద ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఎక్కడెక్కడ వీటిని ఏర్పాటు చేయాలో అధికారులు, సంబంధిత డీసీ ఏఎంహెచ్‌ఓలకు జాబితా అందజేసారు. అడ్వాన్స్ ట్రాకింగ్ సిస్టం విధానంలో ఈ డస్ట్‌బిన్ల పర్యవేక్షణ జరగనున్నాయి.

69 జీవీపీ వద్ద 111 బిన్ల ఏర్పాటు

బిన్లలో 70 శాతం చెత్త పడగానే రాపిడ్ సెన్సర్ ద్వారా ఆ రూట్‌లో ఉన్న స్వచ్ఛ ఆటోను అప్రమత్తం చేస్తుంది. దాంతో ఆ రూట్‌లో వెళ్లే వాహనాలు ఈ బిన్లలో నిండుకున్న చెత్తను శుభ్రపరుస్తాయి. దీని ద్వారా బిన్లు నిండే దాకా కాకుండా 30 శాతం ఉండగానే తొలగించడంతో అక్కడ వీధి కుక్కలు చిందరవందర చేసే అవకాశాలు ఉండవని భావిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 జోన్‌లో 69 జీవీపీ వద్ద 111 బిన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ బిన్ల ఏర్పాటు వల్ల సాధ్యమైనంతగా జీవీపీలను తగ్గించాలని ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నారు.

పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి



నూతనంగా ఏర్పాటు చేసిన డంపర్ బిన్లపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్నాం. సర్కిల్–6లో ఎక్కువ శాతం స్లమ్ ఏరియాలలో చెత్త సమస్య ఉందని ఆయా ప్రాంతాల్లో జీవీపీ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ స్మార్ట్‌బిన్లను కాలనీలవాసులు సద్వినియోగం చేసుకుని చెత్తరహిత కాలనీలుగా మార్చుకోవాలి.

–రుద్ర శ్రీనివాస్, ఏఎంహెచ్‌ఓ

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు .. టమాటా రూ.11, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.17, దొండ రూ.38, ఆలుగడ్డ రూ.19, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.28, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.35, చామగడ్డ రూ.43, మునగ రూ.60, చిలుకడదుంప రూ.28, బీట్‌రూట్ రూ.17, కీర రూ.23, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.35. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

దిల్‌సుఖ్‌నగర్‌లో డ్రంకెన్ డ్రైవ్


డ్రంకెన్ డ్రైవ్‌లో పాల్గొన్న ఏసీపీ చంద్రకుమార్

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లో ఆదివారం మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. సౌత్‌ఈస్ట్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్ ఆధ్వర్యంలో మలక్‌పేట ఇన్‌చార్జి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహానాయక్ నేతృత్వంలో తనిఖీలు చేపట్టగా 10 మంది ద్విచక్ర వాహనాదారులను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీలో ట్రాఫిక్ ఎస్సై రాము, ఎస్సై కిరణ్‌లాల్, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం


విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ చింతలకుంట పద్మావతినగర్‌లోని రెయిన్‌బో గ్లోబల్ స్కూల్‌లో ఆదివారం ఉచిత దంత పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు గౌరి, ప్రతేజ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు దంత పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సలహాలు ఇచ్చారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ఈ శిబిరం నిర్వహించామని భవిష్యత్‌లో మరిన్ని శిబిరాలను నిర్వహిస్తామని విద్యాసంస్థ చైర్మన్ ఎం.ఎం.షరీఫ్ తెలిపారు. కార్యక్రమంలో మూర్తి, ఇమ్రాన్, ప్రసన్న, నళిని, ప్రిన్సిపాల్ హెన్నా బెట్టీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం


గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చంపాపేట: సంకష్ట హర చతుర్థి సందర్భంగా ఆదివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో ఈట లావణ్య ఆధ్వర్యంలో సామూహిక గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ గణపతికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి అర్జిత సేవల టికెట్లు పొందిన భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు చంద్రకాంత్ శర్మ, సంతోష్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, అంబ ప్రసాద్‌శర్మ, పవన్ కుమార్, సిబ్బంది వెంకటయ్య, రమాదేవి, వేణు గోపాల్ పాల్గొన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా


సుజాతానాయక్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా డివిజన్‌ను తీర్చిదిద్దుతానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. ఆదివారం ఆమె పలు ప్రాంతాల్లో పర్యటించగా వివిధ సమస్యలను స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో అర్ధంతరంగా నిలిచిపోయిన వరద నీటి కాలువ పనులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెను సన్మానించారు. కార్పొరేటర్ వెంట గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజిరెడ్డి ఉన్నారు.